ప్రజాశక్తి

శనివారం 17 ఫిబ్రవరి 2024 5

శ్రీ సత్యసాయి





ఎయిర్‌పోర్టులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన రెడ్డి ఈనెల 18న పుట్టపర్తికి రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డిలు అధికారులకు సూచించారు. ఈ నెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రానున్నారు. మధ్యాహ్నం 2.45 గుంటలకు ముఖ్యమంత్రి పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో 2.45 గంటలకు బయలుదేరి రాప్తాడుకు వెళ్తారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని సాయంత్రం రాప్తాడు నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.35 నిమిషాలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుండి సాయంత్రం 5-45 గంటలకు బయలుదేరి గన్నవరం ఎయిర్ పోర్టుకు వెళ్తారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి భద్రతా సిబ్బందితో పుట్టపర్తి ఎయిర్ పోర్ట్‌లో ఎఎస్ఎల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ ఎయిర్ పోర్టులో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వై.నాగేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై నిరసనాగ్రహం పెల్లుబికింది. కేంద్రం తీరుపై కార్మికులు, కర్షకులు భగ్గుమన్నారు. సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు, రైతులు రోడ్లపైకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు. చిన్నా, పెద్ద, ఉద్యోగి, నిరుద్యోగి, కార్మికుడు, కర్షకుడు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉద్యమబాట పట్టారు. హక్కుల సాధనే లక్ష్యంగా సమ్మె ముంగిట జనమంతా నిలిచారు. నిరసనలు, నినాదాలు, ర్యాలీలతో జిల్లా దద్దరిల్లింది. ప్రజలు, కార్మికులు, సంఘటితంగా సమ్మెలో పాల్గొని ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపి ప్రభుత్వానికి సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ ద్వారా నిరసనను తెలియజేశారు.



హిందూపురంలో నిరసన ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు

భగ్గుమన్న కార్మిక, కర్షకలోకం



- ◆ జిల్లాలో సార్వత్రిక సమ్మె-గ్రామీణ బంద్ విజయవంతం
- ◆ అన్ని ప్రాంతాల్లోనూ నిరసన ర్యాలీలు
- ◆ బిజెపి విధానాలపై పెల్లుబికిన ప్రజాగ్రహం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ జిల్లా వ్యాప్తంగా కొనసాగింది. కార్మిక, ప్రజాసంఘాలతో పాటు వామపక్షాలు బంద్‌లో పాల్గొన్నాయి. ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మె జిల్లాలో విజయవంతం అయ్యింది. అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎఎఫ్‌టియున్యూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో స్కీం వర్కర్లు, బిఎస్ఎన్ఎల్, తదితర ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పని చేసే కాంట్రాక్టు కార్మికులు అన్ని కార్యాలయాల నుంచి సమ్మెలో పాల్గొన్నారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేలా తీసుకొచ్చిన నల్లచట్టాల అమలుకు దొడ్డదారిన ప్రయత్నిస్తున్న బిజెపి ఆ విధానాలను విరమించుకోవాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని నినాదాలు చేశారు.

జిల్లాలో సమ్మె వార్తలు, ఫొటోలు 6లో



ఓబుళదేవరచెరువులో నిరసన తెలుపుతున్న వామపక్ష, కార్మిక, రైతుసంఘం నాయకులు

'సిద్ధం' సభకు తరలివెళ్దాం

ప్రజాశక్తి-మడకశిర



మాట్లాడుతున్న వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప

అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఈ నెల 18వ తేదీ నిర్వహిస్తున్న సిఎం జగన్ సిద్ధం సభకు పెద్దఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపు నిచ్చారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం జగన్ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో సంక్షేమ, అబివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో మరోమారు వైసిపిని గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.రంగేగౌడ్, ఎంపిపి కవితవిజయరంగేగౌడ్, గుడిబండ సర్పంచి కరుణాకర్‌గౌడ్, గుడిబండ మండల కన్వీనర్ ఎంజారెగౌడ, ప్రసన్నకుమార్, తిమ్మప్ప, మల్లికార్జున, రాజు, ఇక్బాల్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్'కు హైకోర్టు అనుమతి
జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ



'రాజధాని ఫైల్స్' చిత్రం ప్రదర్శనకు హైకోర్టు అనుమతి ఇవ్వడం జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని ఫైల్స్ సినిమాతో అమరావతిలో రైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన దారుణాలు వెలుగులోకి వస్తాయనే సిఎం జగన్ అడ్డుకునే ప్రయత్నం చేశారని మండి పడ్డారు. అమరావతి రైతుల త్యాగాలను, రాజధాని నిర్మాణాన్ని, రాష్ట్రాభివృద్ధిని జగన్ ధ్వంసం చేశార న్నారు. 34 వేల మంది రైతుల త్యాగాలకు వాస్తవ రూపం ఈ సినిమా అన్నారు. మూడు ప్రాంతాల పేరుతో రాష్ట్రాన్ని విడగొట్టి రాజకీయ లబ్ధి పొందా లనుకున్న జగన్‌కు ప్రజలు త్వరలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. నిన్నటి దాకా మూడు రాజధానులు అని, నేడు హైదరాబాద్ రాజధాని అంటూ నాటకాలు ఆడుతున్నారన్నారు.

'జగన్ అండ్ కో' వెన్నులో వణుకు

మడకశిర : ఇటీవల విడుదలైన 'రాజధాని ఫైల్స్' సినిమాతో సిఎం జగన్‌తో పాటు వైసిపిలో వెన్నులో వణుకు పుట్టిందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని బాలాజీనగర్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం తిప్పేస్వామి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 34 వేల మంది రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునే నీచస్థితికి జగన్ ప్రభుత్వం దిగజారిందని విమర్శించారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏంటని ప్రశ్నించారు. ఈ సినిమా ద్వారా ప్రజల్లో మరింత వ్యతిరేకత వస్తుందనే భయంతోనే వైసిపి కోర్టు కెళ్లిందన్నారు. మూడు రాజధానుల పేరుతో జగన్ అండ్ కో ఎపిని నిలువు దోపిడి చేసిందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు భక్తర్, రామాంజనేయులు, కృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి, తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

వైసిపిని గద్దె దించడానికి ప్రజలు సిద్ధం

ప్రజాశక్తి-పెనుకొండ

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణం లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లా డుతూ వైసిపి ప్రభుత్వంలో అన్ని రంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఒక్క ఛాన్స్ అని అధికారం చేపట్టి ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసకర పాలనను ప్రారంభించి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్తును నాశనం చేశాడన్నారు. మహిళ లు, మైనారిటీలు, బిసిలు, దళితులపై దాడులకు తెగబడ్డారన్నారు. అవన్నీ ఆగి, రాష్ట్రం అభివృద్ధి చెం దాలంటే టిడిపి-జనసేన కూటమిని గెలిపిం చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయ కులు వెంకటరమణ, డివి ఆంజనేయులు, రమణ మ్మ, సోము, మాగేచెరువు సర్పంచి నరసింహులు, త్రివేంద్రనాయుడు, మారుతి, కృష్ణమూర్తి, వాసుదేవరెడ్డి, మణికంఠ, బాలాజీనాయక్, దాదు, శ్రీనివాసులు, అంజనప్ప పాల్గొన్నారు.

నాయనిపల్లి పాఠశాలను సందర్శించిన రాష్ట్ర బృందం

ప్రజాశక్తి-లేపాక్షి

జిల్లాలో మోడల్ ఫౌండేషన్ స్కూల్ ఏర్పాటు కోసం శుక్రవారం ఇద్దరు సభ్యులు గల రాష్ట్ర బృందం లేపాక్షిలో పర్యటించింది. బృంద సభ్యులు స్టేట్ కో ఆర్డినేటర్ సూరిబాబు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు పలు ప్రాంతాల్లోని పాఠశాలలను సందర్శించారు. రాష్ట్రంలో 40 మోడల్ ఫౌండేషన్ స్కూల్స్‌ను ఎంపిక చేయాల్సి ఉండగా జిల్లాలో రూరల్ ఏరియా విభాగం నుంచి ఒక పాఠశాలను ఎంపిక చేసేందుకు నాయనపల్లి ఎంపియుపి పాఠశాలను సందర్శించారు. భవనాలు, తరగతి గదులు, ఫర్నిచర్, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల ప్రతిస్పందన, తదితర అంశాలను పరిశీలించారు. వారి వెంట సమగ్ర శిక్ష జిల్లా విద్యా విషయక పర్యవేక్షణ అధికారి మహేంద్రరెడ్డి, ఎంఇఒలు నాగరాజు, కుళ్లాయప్ప, హెచ్‌ఎం ఇలియాజ్, ఐసిడిఎస్ సూపర్వైజర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



నాయనిపల్లి పాఠశాలను సందర్శించిన రాష్ట్ర బృందం



మండల సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

మండల మీట్‌కు ప్రజాప్రతినిధుల డుమ్మా

ప్రజాశక్తి-అగళి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి రేణుక కామరాజు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. మొత్తం 13 మంది సర్పంచులకు గానూ ఇద్దరు, 9 మంది ఎంపిటిసిలకు గానూ ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. 12 మంది మండల అధికారులు హాజరైనా వారి శాఖల ప్రగతిపై చదువుకుంటూ వెళ్లిపోయారు. సమా వేశంలో అభివృద్ధిపై ప్రశ్నించే వారే కరువయ్యారు. విద్యుత్ ఎఇ లేకపోవడం రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని లైన్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. రొళ్ల, మడకశిర మీదుగా పుట్టపర్తికి బస్సు సర్వీసులు నడపా లని ఆర్టీసీ సిబ్బంది కోరారు. సమావేశంలో ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కదిరేపల్లి పంచాయతీ గుర్రపుకొండ ఎగువతండాకు తక్షనమే ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని ఎఐబిఎస్ఎస్ తాలూకా అధ్యక్షుడు, న్యాయ వాది బాబు నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2020లో ఎస్టిమేషన్ ప్రకా రం రూ. 1,11,757 సంబంధిత అధికారికి చెల్లించామన్నారు. తండాల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి ఎగువతండాకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను మంజూరు చేయాల ని కోరారు. కార్యక్రమం లో డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు హనుమంతు, సిపిఎం నాయకులు రామాంజనేయులు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఉమేష్‌నాయక్, శంకర్‌నాయక్, బాషానాయక్, తిప్పానాయక్, గోపాల్‌నాయక్, రఘు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపాల్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాఠశాల వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆ ఇద్దరు మెత్తబడుతున్నారా. ?

◆ పెద్దిరెడ్డితో సిద్ధారెడ్డి మంతనాలు ◆ అధిష్టానం టచ్‌లో ఉందని కాపు ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్టు దక్కలేదని అలకబూనిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు మెత్తబడుతున్నట్టు కనిపిస్తోంది. మొన్నటి వరకు జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి పెద్దిరెడ్డిని కలవకుండా దూరందూరం ఉంటూ వచ్చిన ఆ ఇద్దరు ఇప్పుడు వైసిపి ముఖ్య నేతలకు టచ్‌లోకి వెళ్తున్నారు. కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి శుక్రవారం నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలవడం చర్చనీయాంశమవుతోంది. ఆయనతోపాటు అసంతృప్తి నేతలుగానున్న ఇస్మాయిల్ కూడా పెద్దిరెడ్డిని కలిశారు. అంతకు మునుపు ఈ నేతలను కలసి బుజ్జగించేందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రయత్నించి నప్పటికీ అందుబాటులో లేకుండాఎ ోయారు. దీంతో సిద్దారెడ్డి పార్టీకి దూరమవు తున్నారా అన్న చర్చ అప్పట్లో నడిచింది. ఇప్పుడు ఉన్నట్టుండి పెద్దిరెడ్డి ముందుకు అసంతృప్తి నేతలంతా కలవడం చూస్తే అలక వీడినట్టు కనిపిస్తోంది. దీనికి కొన్ని ఆర్థికపరమైన కారణాలూ లేకపోలేదన్న అభిప్రాయం వైసిపి వర్గాల నుంచే వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేనున్న సమయంలోనే పెద్దఎత్తున ప్రభుత్వ వర్కులు చేసినట్టు తెలుస్తోంది. కోట్లాది రూపాయల బిల్లులు రావాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీని ఇప్పట్లో వీడితే బిల్లులు ఏమవుతాయోనన్న గుబులుతో తిరిగి వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. ఇకపోతే రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కూడా ఇదే బాటలో పయనిస్తున్నట్టు కనిపిస్తోంది. అధిష్టానం టచ్‌లో ఉందని ఆయన ఇటీవల చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతకరించుకుంది. కొత్త సమన్వయ కర్తను నియమించిన సమయంలో అధిష్టానంపై తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేశారు. తాడేపల్లికి సెల్యూట్ అని సెల్యూట్ చేసి మరీ వచ్చారు. అనంతరం కూడా తాను స్వతంత్రంగానే రాయదుర్గం, కళ్యాణదుర్గం పోటీ చేస్తామని కూడా ప్రకటించారు. అంతేకాకుండా స్థానిక వైసిపి నాయకులతోపాటు, కొత్త సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డితో పలుమార్లు బాహాటంగానే విమర్శలు చేస్తూ వస్తున్నారు. మరోవైపు అధిష్టానంతో టచ్‌లో ఉందని, అవకాశం లభిస్తే వెళ్లి కలుస్తానని కూడా ప్రకటించారు. దీన్ని బట్టి తిరిగి ఆయన వైసిపిలోకే వెలుతారన్న చర్చ నడుస్తోంది. ఈ రకంగా తిరుగుబాటు బావుట ఎగరేస్తారనుకున్న నేతలిద్దరూ పాత గూటి వైపే అడుగులేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అసంతృప్తులుగానున్న ఈ ఇద్దరు నేతలు అలకవీడితే వైసిపిలో అసంతృప్తులు దాదాపుగా లేనట్టుగానే అవుతుంది. ఇప్పటి వరకు ప్రకటించిన కొత్త సమన్వయకర్తల్లో పూర్తిగా టిక్కెట్టు లేకుండా ఉన్నది నాలుగు స్థానాలు మాత్రమే అందులో కదిరి, రాయదుర్గం ఒక్కటే అసంతృప్తితోనున్నది. మార్పు జరిగిన శింగనమల, మడకశిరలో అసంతృప్తులున్నా సిట్టింగ్ మాత్రం పార్టీ వెంటనే ఉంటూ వచ్చారు. వైసిపిలో క్రమక్రమంగా అన్నీ సెట్ అవుతూ వస్తున్నాయి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎక్కడైనా అసంతృప్తులున్నా అన్నింటినీ సెట్ చేస్తున్నారు. అలకబూనిన నేతలతో ప్రత్యేకంగా చర్చించి దారిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే రకంగా హిందూపురంలో నాలుగు రోజులు అక్కడే మకాం వేసి చాలా వరకు సెట్ చేసారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



పివి.సిద్ధారెడ్డి



కాపు రామచంద్రారెడ్డి

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-మడకశిర

ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. గుండుమల సర్పంచి చంద్రప్ప, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ మనోహర్, బి.క్రిష్టప్ప, నరసింహారెడ్డి మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాల్లో ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు కార్డుదారులకు అందడం లేదన్నారు. అధికారులు చర్యలు తీసుకొని ప్రతి ఒక్కరికీ నిత్యావసర సరుకులు అందేలా చూడాలని కోరారు.

వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నాగరాజు

ప్రజాశక్తి-పెనుకొండ



పెనుకొండకు చెందిన న్యాయవాది, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.నాగరాజును వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించారు. దీంతో శుక్రవారం పట్టణంలోని బార్ అసోసి యేషన్ హాలులో తోటి న్యాయవాదులు, వైసిపి నాయకులు నాగరాజుని ఘనంగా సన్మానించారు. నాగరాజు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, వైసిపి గెలుపునకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివశర్మ, జావిద్, నాగిరెడ్డి, వాల్మీకి శ్రీనివాసులు, మోహన్, విక్రాంత్‌నాయక్, కురుబ అశ్వర్థనారాయణ, దేవాంగం శ్రీనివాసులు, బాలాజీ, హరి పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

వ్యాపారులతో కందికుంట ఆత్మీయ పలకరింపు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాజకీయాల్లో కులం, మతం కాకుండా అందరి క్షేమం అభివద్ధి ఆకాంక్షించే వ్యక్తిగా తనను చూడాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ వ్యాపారులను కోరారు. కదిరి పట్టణం ఇక్బాల్ రోడ్‌లో శుక్రవారం నాడు వ్యాపారస్తులతో ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ కదిరి నియోజకవర్గం అభివృద్ధికి గత గత 20 సంవత్సరాలుగా తాను పనిచేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అభివద్ధిని ఆకాంక్షించించి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్ ముస్తఫా, మాజీ కౌన్సిలర్ ఖాదర్ బాషా, తదితరులు ఉన్నారు.

పేదల గుడిసెల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ స్థలంలో పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెల వద్ద తాగునీరు, విద్యుత్, తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ముందు పేదలు ధర్నా చేపట్టారు. వీరికి కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సిఐటియు మండల కార్యదర్శి కొండ వెంకటేష్ మద్దతు తెలి పారు. పేదలు మాట్లాడుతూ గుడిసెల వద్ద కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఇళ్లు నిర్మించుకుం దామంటే ఇసుక ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్లను రెవెన్యూ అధికారులు అడ్డుకుంటు న్నారని వాపోయారు. కార్యక్రమంలో ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ అధ్యక్షురాలు అశ్విని, వజీర్, వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన పేదలు

'భవిష్యత్తుకు గ్యారెంటీ'పై సమావేశం

మడకశిర : టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' ప్రజలకు ఓ వరం అని నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. రొళ్ల మండలం లోని రత్నగిరి, కాకి, బ్యాడగెర గ్రామాల్లో శుక్రవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌ఛార్జులతో సమవేశమై భవిష్యత్తు గ్యారెంటీ విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో నాగేంద్ర, నగేష్, కిరణ్, దాసప్ప, సురేష్, మంజు, మంజునాథ్, బ్యాడగెర మూర్తి, కాంత్, నాగలింగాచారి పాల్గొన్నారు.

కార్మిక, కర్షక హక్కులపై కేంద్రం దాడి దుర్మార్గం


పుట్టపర్తి కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


చిలమత్తూరులో బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


కదిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు
జిల్లాలో సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

కార్మిక వర్గం సాధించుకొన్న హక్కులపై ప్రభుత్వం దాడి చేయడానికి సిఐటియు తీవ్రంగా ఖండిస్తోందని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం కేంద్ర కార్మిక కర్షక సంఘాలు దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఆ పిలుపులో భాగంగా పుట్టపర్తి కేంద్రంలో సిఐటియు, ఎఐటియుసి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గణేష్ కూడలిలో నిరసన తెలిపారు. కేంద్రంలోని బిజెపికార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక చట్టాలోని సారాన్ని తీసివేసి సమ్మె హక్కును హరించిందన్నారు. అయినా గత పదేళ్ళలో కార్మిక వర్గం అనేక అద్భుతమైన పోరాటాలు సాగించిందన్నారు. దేశంలోనే అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తాం లేదా మూసివేస్తామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో పదేపదే ప్రకటించారన్నారు. కార్మికవర్గ పోరాటాల ఫలితంగా ఒక్క భారీ ప్రభుత్వరంగ పరిశ్రమను కూడ అమ్మలేక పోయారనీ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గత 1100 రోజుల నుండి జరుగుతున్న నిరవధిక పోరాటం అందులో భాగమే అని అన్నారు. పరిశ్రమలను ముక్కలుగా చేసి అమ్మడంలో భాగంగా జాతీయ హైవే రోడ్డులు, రైల్వేలు, విద్యుత్ రంగాలను ముక్కలు చేసి అమ్మాలని కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. దీనినే జాతీయ మోనిటైజేషన్ పైప్‌లైన్ అని కేంద్ర ప్రభుత్వం నామకరణ చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న బిరుదును ప్రకటించిందేకాని ఆయన ప్రతిపాదించిన కనీసం మద్దతు ధరను తిరస్కరించిందన్నారు. డాక్టర్ స్వామినాథన్ రైతన్న లకు మేలు చేసే విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి ప్రకటించారన్నారు. మద్దతు ధర అంటే రైతు పంటను పండించడానికి అయ్యే ఖర్చు, రైతు కుటుంబం చేసే శ్రమకు అదనంగా 50 శాతం జోడించాలని వివరించారన్నారు. ఇది అమలు కానందునే వ్యవసాయం నేడు దివాలా తీసిందన్నారు. గతంలో జరిగిన రైతు ఉద్యమానికి దిగొచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడు నల్ల చట్టాలు వెనక్కి తీసుకుంటామని గిట్టుబాటు ధర కల్పిస్తామని రైతులపై కేసులు ఎత్తివేస్తామని చేసిన వాగ్దానాలు నేటికీ అమలు కాలేదన్నారు. రైతులపై 45 వేల పోలీస్ కేసులు ఉన్నాయని 742 మంది ఆ ఉద్యమంలో మృతిచెందారని చెప్పారు. ఈ ఉద్యమాన్ని అణచడానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత కిరాతక పద్ధతుల్లో ప్రయత్నించి విఫలమైందన్నారు. పైగా దొడ్డిదారిన వ్యవసాయ రంగాన్ని ఆదానీ, అంబానీ తదితర కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియు జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సిఐటియు జిల్లా నాయకులు బ్యాళ్ల అంజి, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు సుజాత, కోశాధికారి మంజుల, ప్రాజెక్ట్ నాయకులు భగవతి, శ్రావణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగార్జున, నరసింహులు, రామయ్య, గోవిందు, సత్యసాయి వాటర్ వర్కర్స్ మధు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ముత్యాలు, శ్రావణి, నాగమణి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : కార్మిక చట్టాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుండి బస్టాండ్ కూడలివరకు ర్యాలీ చేపట్టి బస్టాండ్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కేశప్ప, సూర్యనారాయణ, శ్రీనివాసులు, రమణ, మణి, మహేష్ బాబు, ఎం శ్రీనివాసులు, రమణప్ప, స్వచ్ఛభారత్ కార్మికులు అంజనప్ప, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా చిలమత్తూరు మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు,పాఠశాలలను బంద్ చేయించి బస్టాండ్ లో రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ఢిల్లీలో చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ. 10 లక్షల నష్టపరిహారం, ఉద్యోగం ఇస్తామనినమ్మించి మోసం చేసిందన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, లక్ష్మినారాయణ, రామచంద్ర సుధాకర్, మంజునాథ, సదాశివరెడ్డి, చందు, ఆటో యూనియన్ నాయకులు రహమంతుల్లా, మురళి, రామాంజినేయులు, రజియా భాను, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని రైతుసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ కాటమయ్య డిమాండ్ చేశారు. గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలో గొట్లూరు గ్రామంలో సీపీఎం నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సచివాలయాన్ని బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశప్రజలకు ఆహారాన్ని అందించే రైతులకు కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారస్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యకులు జంగాలపల్లి పెద్దన్న, రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జేవీ రమణ, నాయకులు ఎన్‌హెచ్. బాషా, వెంకటనారాయణ, మారుతి, రామకృష్ణ, రైతులు నరసింహారెడ్డి, సుబ్బరాయుడు, అశోక్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్ లుగా విభజించి కార్మికులు కర్షకులకు తీవ్ర నష్టం చేసిందని సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు బడా సుబ్బిరెడ్డి, జిల్ నరసింహులు విమర్శించారు. భారత గ్రామీణ బంద్ నేపథ్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో రైతు, కార్మిక,విద్యార్థి సంఘాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బిరెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల, కర్షకుల, రైతుల రక్తాన్ని పిప్పిచేసి కార్పొరేట్లకు దారపోస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. మతోన్మాద పాలనకు వ్యతిరేకంగా 2024 ఎన్నికల్లో మోడీని ప్రజలందరూ ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి లియాకత్ అలీ, సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నల్లజోడు పవన్, జిల్లా ఉపాధ్యక్షులు శేషం మహేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాబ్జాన్, ఎఐటియుసి నాయకులు ఇమ్రాన్, అదెప్ప, సిఐటియు నాయకులు జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, ఎఐఎస్ఎఫ్ నాయకులు దుద్దిరెడ్డి, సాయి, ప్రవీణ్, అశోక్ ,ఆవాజ్ నాయకులు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలో సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన భారత్ గ్రామీణ బంద్ విజయవంతం అయింది. పెద్ద ఎత్తున నాయకులు కార్మికులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మోడీ అనుకూలంగా వ్యవహరించడం మానుకోవాలన్నారు. టిడిపి, జనసేన పార్టీలు మోడీకి కొమ్ము కాసే విధానాన్ని విరమించుకోవాలని కోరారు. అదే విధంగా పంజాబ్ రైతుల ఆందోళనకు మద్దతుగా సిక్కుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వ వైఖరిని వారు ఖండించారు. కార్యక్రమాల్లో సిఐటియు రాజప్ప, ఆటో సంఘం రామక్రిష్ణ, మున్సిపల్ సంఘం జగదీష్, రామక్రిష్ణ, ఆనంద్, గురునాథ్, అంగన్వాడీ సంఘం లావణ్య, శిరీష, ఆశాసంఘం మమత, కల్పన, ఎస్ఎఫ్ఐ సంఘం బాబవలీతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు, కర్షకులు పాల్గొన్నారు. సిక్కుల ఆందోళనలో పలవీందర్ సింగ్, హార్మేందర్ సింగ్, భగవాన్ సింగ్, స్థానిక ముస్లిం నగరా అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కల్ వరకూ ర్యాలీ నిర్వహించి రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబి స్తుందని విమర్శించారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయలేదని, విదేశాల్లో ఉన్న నల్లధనం రప్పించలేదన్నారు. అత్యంత ధనవంతులైన కార్పొరేట్లకు రూ. 15.32 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని మండిపడ్డారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కార్మికుల హక్కులపై బిజెపి ప్రభుత్వం దాడి చేస్తుంద న్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, రాజురావు, వ్య.కా.సం. నాయకులు గంగాధర్, వెంకటరాముడు, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, తిప్పన్న, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప కార్మిక, కర్షకుల డిమాండ్లపై మాట్లాడారు. వెలగమాకలపల్లె తండాకు చెందిన గిరిజన కుటుంబాల జీవనోపాధి, వారి పిల్లల ఉన్నత చదువులు, ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు దగ్గరగా అన్ని సదుపాయాలు కల్పించాలని, ప్రత్యామ్నాయ పునరావా సం కల్పించాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ తండాలో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్య.కా.సం. జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి శ్రీదేవి, సిపిఎం మండల నాయకులు మాబు, గంగరాజు, శ్రీకాంత్, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, క్రిష్టప్ప, కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు రామకృష్ణ, వ్య.కా.సం. మండల నాయకులు బెస్త కిష్టప్ప, రామాంజనేయులు, నాగభూషణ, దేవీబాయ్, ప్రభావతిబాయ్ పాల్గొన్నారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కట్టారుపల్లి గొల్లపల్లి ప్రాంతాల్లోని పేకాట స్థావరాలు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఈసందర్భంగా ఆమె హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జమేదారులు రామయ్య, శ్రీనివాసులు, తిరుమలరెడ్డి, సిబ్బంది శ్రీనివాసులు, భాస్కర్ రాజు, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీలకే మద్దతు


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, తదితరులు

బైక్‌ర్యాలీలో బలిజసంఘం నాయకులు

ప్రజాశక్తి కదిరి టౌన్

రాజకీయ పార్టీలకు అతీతంగా ఐకమత్యంతో ముందుకు వెళదామని వచ్చే ఎన్నికల్లో రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీలకు మద్దతు ఇద్దామని బలిజ సంఘం నాయకులు మంచి శివశంకర్ బైరవ ప్రసాద్ గవ్వల శ్రీనివాసులు పేర్కొన్నారు. శ్రీకృష్ణ దేవరాయులు జయంతి పురస్కరించుకొని నియోజకవర్గం వ్యాప్తంగా బలిజలు దాదాపు 2 వేల మంది శుక్రవారం పట్టణంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కోనేరు వద్ద గల శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రోడ్లు భవనాలు అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పార్టీలకు రాజకీయాలకు అతీతంగా కులస్తులలో ఎవరికైనా సమస్య వచ్చినప్పుడు సహకరించుకుందామన్నారు. రాష్ట్రంలో 27శాతం జనాభా కల్గిన బలిజలకు ఏపార్టీ తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించలేదని అన్నారు. బలిజలు పోటీ చేస్తే పార్టీలకు అతీతంగా వారిని గెలిపించుకోవాలని సూచించారు. రాజ్యాధికారం కేవలం ఒకటి రెండు వర్గాలకు కాకుండా రాష్ట్రంలోని అన్ని కులాలకు వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలోబైక్ ర్యాలీ నిర్వహణ కమిటీ సభ్యులచ, శ్రీ కృష్ణ దేవరాయ బలిజ సేవా సంఘం అధ్యక్ష ప్రధానకార్యదర్శులు చింతకుంట రమేష్ బాబు, దృఢం శ్రీనివాసులు, పోగునూరు ఆది, కదిరి పట్టణ బలిజ సేవా సంఘం అధ్యక్షులు కూనక పుల్లయ్య, అఖిల భారత కాపు సమాఖ్య జిల్లా అధ్యక్షులు గవ్వల శ్రీనివాసులు, కదిరి నియోజకవర్గ కాపు రాజకీయ జెఎసి అధ్యక్షులు పసుపులేటి సురేష్ కుమార్, కాపునాడు నాయకులు కొండా మల్లిఖార్జున, బలిజ కాపునాడు జిల్లా అధ్యక్షులు నాదేండ్ల వెంకట ప్రసాద్, ఆర్‌పిఎఫ్ నాయకులు యర్రంశెట్టి రమేష్, కుటాల లక్ష్మణ, బలిజ యువజన సంఘం అధ్యక్షులు గరడాల రమణ, బలిజసేన నాయకులు అన్నం జనార్ధన, మల్లెం రాము, కంచం నాగేంద్ర ప్రసాద్, చిన్న, వెలగ నాగరాజు, ఎద్దుల రాముడు, బాగేపల్లి అశోక్, సత్యనారాయణ, మల్లిఖార్జున జితేంద్ర, రమేష్, భైరిశెట్టి, శీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలో చేనేతలు వైసిపికి మద్దతు తెలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ మేరకు వైసిపి నాయకుడు గడ్డం రంగ ఆధ్వర్యంలో స్థానిక తిక్కస్వామి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 7వ వార్డు నుండి 300 చేనేత కుటుంబాలు టీడీపీని వీడి వైసిపిలో చేరాయి. చేనేత ప్రముఖుడు లింగం కృష్ణమూర్తితో పాటు కురుబ దుర్గమప్ప, అన్నం నాగరాజు, గడ్డం రామకృష్ణ, బుర్రా ఆదినారాయణ పాటు దాదాపు 300 వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేతల కష్టాలు తెలుసుకుని సంక్షేమం ఇతోధికంగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చేనేతలకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇంటిస్థలంతో పాటు మగ్గం షెడ్ నిర్మించుకునేందుకు వీలుగా 1.50సెంట్ల స్థలంతో పాటు గృహ నిర్మాణ సౌకర్యం కల్పించడం జరుగుతోందన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి రెండు పర్యాయాలు ధర్మవరం పట్టణంలో 24వేల మందికి పైగా ఇంటి పట్టాలను మంజూరు చేసి పేదవారి స్వంత ఇంటి కలను సాకారం చేయడం జరిగిందన్నారు. టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకుని ఇబ్బందులు పడుతున్న బాధిత నేతన్నల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున సాయం అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కాచర్ల లక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్, నాయకులు గడ్డం వరలక్ష్మి, గడ్డం రంగ తదితరులు పాల్గొన్నారు.


హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం


కమిషనర్ చాంబర్ ముందు ఆందోళన

గత సంవత్సరం రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు స్థానికంగా మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ డిహాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్ చాంబర్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతు సమ్మె సమయంలో ఇచ్చిన హామీలు నేటికి అమలు చేయలేదన్నారు. వీటిని అమలు చేయక పోతే తాము మరో సారి మెరుపు సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజప్ప, రామక్రిష్ణ, మున్సిపల్ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి జగదీష్, కోశాధికారి ఆనంద్, గురునాథ్, పరమేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లచెరువు : భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండలం లోని సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానికతహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి అనంతరం తహశీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. వెల్ఫేర్ బోర్డును దిష్టిబొమ్మ లుగా మార్చారన్నారు. కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు అమలు కాకుండా జీవో నెంబర్ 1214 తెచ్చి కార్మికుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించకపోతే తిరుగుబాటు తథ్యమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి రమేష్, అంగన్వాడీ, ఆశా, భవన నిర్మాణ కార్మికులు, పారిశుధ్యకార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కోర్సులకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ హరీష్, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యాం కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, దేశీయ నాన్వాయిస్ అసోసియేట్ కస్టమర్ కేర్, వాయిస్, నాన్ వాయిస్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్, ఆ పైన చదివిన వారు ఈ కోర్సులను నేర్చుకోవడానికి అర్హులు అన్నారు. ఆసక్తి ఉన్న యువతి, యువకులు తమ ఆధార్ జిరాక్స్ కాపీ తో పాటు మొబైల్ నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దుకాణంలో చోరీ

ఓబుళదేవరచెరువు : మండలంలోని వేమారెడ్డి పల్లి సమీపంలో ఉన్న రెయిన్బో పాఠశాల వద్ద ఉన్న దుకాణంలో చోరీ జరిగింది. పీట్ల రామాంజనేయులు అనే వ్యక్తి బతుకుతెరువు కోసం రెయిన్బో పాఠశాల వద్ద బంక్ ఏర్పాటు చేసుకుని దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బంకు వెనుక వైపున రేకులకు అమర్చిన స్క్రూలను తొలగించి బంకులోకి ప్రవేశించి తినుబండారాలు, నిత్యావసర సరుకులు, నగదు ఎత్తుకెళ్లారు. దీంతో తనకు రూ. 50వేల దాకా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని యాదవ వీధికి చెందిన బత్రాజులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకుడు కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అధైర్య పడవద్దని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోరకాటిపురుషోత్తంరెడ్డి, వడ్డే బాలాజీ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

పుట్టపర్తి రూరల్: త్వరలో ఆంధ్ర కర్ణాటకలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర కర్ణాటక సరిహద్దుల చెక్‌పోస్టుల్లో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. శుక్రవారం కర్ణాటక ప్రాంతంలోని చిక్‌బల్లాపూర్ లో ఆ జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి రవీంద్ర ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర బోర్డర్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చిక్‌బల్లాపూర్ జిల్లా ఎస్పీ నగేష్, శ్రీ సత్య సాయి జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్, ఈఎస్ సుబ్రహ్మణ్యం, హిందూపురం డిఎస్‌పి కంజక్షన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరం వన్ టౌన్ ఎస్ఐగా శ్రీనివాస్

ధర్మవరం టౌన్ : ధర్మవరం వన్ టౌన్ ఎస్ఐగా డి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం సీసీ నుంచి బదిలీపై ధర్మవరం వన్‌టౌన్ స్టేషన్‌ను వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మహమ్మద్ రఫీ తిరుపతికి బదిలీపై వెళ్లారు.

సూర్యప్రభ వాహనంపై నారసింహుడు

కదిరి టౌన్ : ఖాద్రీనారసింహుడు సూర్య ప్రభవాహనంలో దర్శనమిచ్చాడు. రథసప్తమి సందర్భంగా శ్రీ కదిరి లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు.. ప్రధాన అర్చకులు కుమారస్వామి పార్థసారథి స్వామి, పాలకమండలి చైర్మన్ గోపాలకష్ణ,పాలకమండలి సభ్యులు రొద్దం రవీంద్రారెడ్డి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

పుట్టపర్తి అర్బన్ : తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. డిపో అధ్యక్షుడు శివశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షబ్బీర్, కడప జోనల్ సంయుక్త కార్యదర్శి శ్రీరామ్ నాయక్, రవితేజ, బాబ్జాన్, అప్పిరెడ్డి, గయాజ్, ఈశ్వరప్ప, విజయలక్ష్మి, ప్రేమ కుమారి, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన సంప్రదాయాలను కాపాడుదాం

కొత్తచెరువు : ప్రాచీన సాంప్రదాయాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు కాపాడుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ తెలిపారు. మండల పరిధిలోని పాత దేవరపల్లిలో కురుబ కులస్తులు నిర్వహిస్తున్న గుడికట్ల సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు అంగడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

పుట్టపర్తి రూరల్ : రోడ్డు ప్రమాదానికి గురైన గౌరమ్మ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని పుట్టపర్తి నియోజకవర్గం తెలుగుదేశం టికెట్ ఆశిస్తున్న డీఎసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పుట్టపర్తి మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో గురువారం రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన గౌరమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వేణుగోపాల్‌తో పాటు వెంకటస్వామి, నాగరాజు, రఘు యాదవ్, వెంకటేష్ తిరుపతేంద్ర, రవి , బత్తలపల్లి గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 12వ పిఆర్‌సి అమలులో జాప్యం చేస్తున్న నేపథ్యంలో 30 శాతం ఐఆర్ తక్షణమే మంజూరు చేయాలని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మాధవ, జిల్లా జెఏసీ ఛైర్మన్ బి.చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ డి.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భోజన విరామ సమయంలో డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట జేబులకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 13 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. 12 పిఆర్‌సి కమిషన్ నియామకానికే పరిమితం చేశారని విమర్శించారు. తక్షణమే భృతి ఇవ్వాలన్నారు. బకాయి పడ్డ డీఏలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జమీలా బేగం, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీన్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీలు శోభారాణి, లింగమేష్, నగర అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ రెడ్డి, శ్రీధర్ బాబు, అక్కులప్ప, శ్రీనివాసులు, ఎంపీ ఎచ్ఈఒ సిఎచ్ఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మన్న, ఎపి మినిస్టీరియల్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మఖ్బూల్ తదితరులు పాల్గొన్నారు.



డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎన్జీవోలు

శ్రీకృష్ణదేవరాయలుకు నివాళి





శింగనమల, రాయదుర్గం, అనంతపురంలో శ్రీకృష్ణదేవరాయలుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

శింగనమల : శ్రీకృష్ణదేవరాయుల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ఆత్మా రామస్వామి ఆలయంలో చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే శ్రీకృష్ణదేవరాయుల కాలం ఆదర్శనీయమన్నారు. వజ్ర, వైడూర్యాలను రాశులుగా పోసి వ్యాపారం చేయించి ప్రజలను సొంత బిడ్డల కంటే ఎక్కువగా చూసుకున్న ఘనత రాయలుకే దక్కుతుందన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగయ్య, తోట ఓబులేసు, మాసూల చంద్ర, నారాయణస్వామి, పెద్దమట్లగొంది నాగేంద్ర, శంకర, మురళి, దత్తసాయి, చంద్ర, రమణ, జయకృష్ణ, వెంకటనారాయణ, నాగార్జున, బాల గంగాధర, తోట రామమోహన్, మనోహర, నాగేంద్ర, రంగ, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : శ్రీకృష్ణదేవరాయుల జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో బలిజ సోదర, సోదరీమణులు రాయలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పాలాభిషేకం, చేసి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు పద్మా ఎర్రిస్వామి, గాజుల నరసింహులు, పద్మ గోవిందు, గానిగి ఆంజనేయులు, గాజుల వెంకటేశులు, పద్మా కృష్ణ, గాజుల రాము, పద్మా అనిల్‌కుమార్ బలిజ కుల సోదకులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : శ్రీకృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బలిజ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడు తూ బలిజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, కళ్యాణ మండపం నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరారు. అంతకుముందు కోటలోని వెంకటరమణస్వామి ఆలయం నుంచి రాణి సత్రం వద్ద ఉన్న రాయలు విగ్రహం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించి విగ్రహానికి అభిషేకం చేశారు. చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి ఊరేగించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి కోదండ సత్యనారాయణ, గిరిధర్, శ్రీనివాసులు, కౌన్సిలర్లు బండి అజయ్, శ్రీనివాసులు, నాయకులు వెంకటేశులు, సంపత్ కుమార, పవన్ కుమార్, మధుసూదన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అనంతపురం : శ్రీ కృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని అనంతపురంలోని నడిమివంక వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బలిజసంఘం నాయకులు ఆకుల రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గురుసాయి, శివ, అనిల్, రమేష్, గురుశివ, శంకర్ తదితరులు నివాళులు అర్పించారు.

వ్యాపారవేత్తలుగా ఎదగాలి



సదస్సులో మాట్లాడుతున్న చంద్రమౌళి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి వ్యక్తి తన సృజనాత్మకతను ఉపయోగించుకొని వినియోగదారుల అవసరాలు, సమస్యలపై అవగాహన కలిగి కొత్త కొత్త వ్యాపార సరళిని కనుగొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ చంద్రమౌళి, కార్యక్రమ మెంటర్ డాక్టర్ జ్యోతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌డిజిఎస్ ఎంబిఏ కళాశాలలో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అటల్ ఇన్నోవేషన్ మిషన్ సౌజన్యంతో ప్రిన్సిపల్ డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్ అధ్యక్షతన ఒక్క రోజు మేనేజ్మెంట్, కామర్స్ విద్యార్థులకు యాన్ అవేర్నెస్ వర్క్ షాప్ ఆన్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ప్ రైస్యూర్షిప్' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా ఇతరులకు ఉపాధి కల్పించే విధంగా అభివృద్ధి చెంది రాబోయే తరాల వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సదస్సులో కళాశాల ప్రెసిడెంట్ రేపూరు చంద్రమోహన్, సెక్రటరీ బైసాని రాంప్రసాద్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే మా లక్ష్యమని ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు ఛైర్మన్, రిటైర్డ్ జిల్లా జడ్జి వి శ్రీనివాస్ ఆంజనేయ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద గల సబ్ స్టేషన్ లో పట్టణ రూరల్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు దాదాపు 60 మంది దాకా వినియోగదారులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ ఆంజనేయ మూర్తి మాట్లాడుతూ విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు ఉన్న సమస్యలను తీర్చేందుకే ఈ పరిష్కార వేదికను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఇ బాలాజీ వెంకటేష్, ఏడిఈ నాగేంద్ర, ఏఏవో రామకృష్ణ, ఏఈలు నాగభూషణ, కొండారెడ్డి, జానకి రామయ్య, కార్యాలయ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



వైసిపి నాయకులతో మాట్లాడుతున్న వేణురెడ్డి

సిద్ధం సభను విజయవంతం చేద్దాం

వైసిపి నాయకులు వేణురెడ్డి

హిందూపురం : ఈ నెల 18న ఆదివారం రాప్తాడులో జరగనున్న సిద్ధం సభను విజయవంతం చేద్దాం అని వైసిపి నాయకులు వేణురెడ్డి పిలుపు నిచ్చారు. సభను విజయవంతం చేయాలని కోరుతు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు, పట్టణ వ్యాప్తంగా ఉన్నా నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణానికి 80 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాల్గొంటున్న సిద్ధం సభను విజయవంతం చేయాలన్నారు. అదే విధంగా ఇటీవల ఎ బ్లాక్ కన్వీనర్‌గా నియమించిన మన్సూర్ ఖాన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వ్యాప్తంగా ఉన్నా నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గికి బయపరెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం. బహిరంగసభకు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. ఈసందర్భంగా సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, సర్పంచులు చల్లా కరుణాకరాయుడు, చెడిపోతుల గోపాల్, ఎంపీటీసీ కోట్ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి :ఈనెల 18న రాప్తాడులో నిర్వహించే సిద్ధం మహాసభను విజయవంతం చేయాలని వైసిపి సీనియర్ నాయకుడు పైడేటి ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పరిగి మండల కేంద్రంలోని భీర లింగేశ్వర కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉమ్మడి అనంతపురం జిల్లా వైసీపీ వైసిపి నాయకులను కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేయాలని ఉద్దేశంతో తలపెడుతున్న ఈ మహాసభకు మండల వ్యాప్తంగా ఉన్న వైసీపీ నాయకులు కార్యకర్తలు తరలిరావాలన్నారు.

ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం

మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సచివాలయంలోని ప్లానింగ్ కార్యదర్శులు, అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులతో అత్యవసర సమావేశాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ప్లానింగ్, అడ్మిన్, రెవెన్యూ కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్

పట్టణాభివృద్ధే లక్ష్యం

హిందూపురం : హిందూపురం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని వైసిపి ఇన్‌ఛార్జ్ దీపిక అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లాతో కలిసి పట్టణంలోని 22వ వార్డులో రూ. 12లక్షలతో మురుగు కాలువ నిర్మాణానికి, 7వ వార్డులో రూ.20లక్షలతో నూతన మురుగు కాలువ నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముస్తక్, నాసీర బాను, పలువురు కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫిరోస్ ఖలీల్, టౌన్ క్లస్టర్ 1 కన్వీనర్ మన్సూర్, టౌన్ మైనారిటీ కన్వీనర్ అయూబ్ భేగ్, జెసిఎస్ కన్వీనర్లు నౌషాద్, శివ శంకర్ రెడ్డి, వైసిపి నాయకులు షఫి, మల్లిక బాను, తిమ్మారెడ్డి, షాజహాన్, నసీబ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే బీసీల అభివృద్ధి

కొత్తచెరువు : ఐకమత్యంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నామాల శంకర్, సత్యసాయి జిల్లా గౌరవాధ్యక్షులు సామకోటి ఆదినారాయణ, తెలిపారు. కొత్తచెరువులో బీసీ నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ పుట్టపర్తి లోనే శిల్పారామంలో బీసీల ఐక్యత సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఈ సమావేశానికి జిల్లాలోనిబీసీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వలిపి శ్రీనివాసులు, గాండ్ల సంఘం నాయకులు శివకృష్ణ, వాల్మీకి సంఘం నియోజకవర్గ నాయకులు డిపో భాస్కర్, నాయకులు చెన్నకేశవులు, నాగరాజు, దూదేకులసంఘం నాయకులు గఫూర్, నాయకులు లింగమయ్య, కేశప్ప, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

బత్తలపల్లి : పేదలకు ఆరోగ్య సేవలను చేరువ చేయడానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని వైద్యాధికారి గంగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఓబుళాపురం పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామ సచివాలయంలో సర్పంచు బండి సరస్వతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అర్హులైన వైద్యులచే చికిత్సలు అందించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ దివాకర్, ఎంపీటీసీ బండి రాములమ్మ, వైసిపి నాయకులు బండి వీరనారప్ప, వైద్యసిబ్బంది, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.:

తలుపుల : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న, జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమం మండలంలోని ఉడుములకుర్తి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అఫ్తాఫ్, కదిరి ఏరియా ఆసుపత్రి నుండి స్పెషలిస్ట్ డాక్టర్లు హరిత, భాస్కర్ నాయక్ పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కొత్తచెరువు : పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి రాధా నాగరాజు, మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్, తెలిపారు కొత్త చెరువులోనే ఒకటవ సచివాలయం వద్ద జగనన్న సురక్షిత ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా 393 మందికి వైద్యసేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిద్దారెడ్డి, మేజర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్, డాక్టర్లు అశ్వత్థ, వరలక్ష్మి, రాధా భార్గవ్‌తో పాటు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడవ దశ రీ సర్వే వేగవంతం : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

భూ రక్ష రీ సర్వే పనులను వేగవంతంగా చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షలో మాట్లాడుతూ రెవెన్యూ రీ సర్వే మూడవ దశ ఇనాం భూములు, అసైన్మెంట్ భూములు, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద కరువు మండలాలలో కూలీలకు అడిగిన వెంటనే పని కల్పించాలని ఆయన ఆదేశించారు. రాబోయే వేసవికాలంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఎపిఐఐసి ప్రాజెక్టుల భూ సమస్యలు తదితర అంశాలపై కూడా కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే మూడవ దశ నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలు, పక్కాగృహాలు రిజిస్ట్రేషన్ చేయించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. రాబోయే వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పంచాయితీరాజ్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి సుబ్బారావు, జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్, డిఎంహెచ్ఓ ఎస్‌వి కృష్ణారెడ్డి, సిపిఓ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రగతి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ సర్వీసు పొందేలా విద్యార్థినులు పోటీ పరీక్షలలో సత్తా చాటాలని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, హైదరాబాద్ ఆప్టెక్ జాబ్స్ కు చెందిన అధ్యాపకులు నారాయణ, సాయి వివేక్ సూచించారు. ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల కోసం సన్నద్ధతపై శుక్రవారం స్థానిక కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను అందుకోవటానికి కళాశాల అందిస్తున్న సదుపాయాలను వివరించారు. ఏపీపీఎస్సీ గ్రూప్ 1 లో ఎనిమిదవ ర్యాంకు పొంది డిప్యూటీ కలెక్టర్ ఎంపికయిన కళాశాల పూర్వ విద్యార్థిని స్వాతి స్ఫూర్తితో విద్యార్థినులు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అకాడమీ కోఆర్డినేటర్ శ్రీధర్, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ సమన్వయకర్త రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు వినికిడి యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

వికలాంగులకు వినికిడి యంత్రాలను వికలాంగుల ప్రోగ్రాం అధికారి అంజనమ్మ పంపిణీ చేశారు. స్థానిక వికలాంగుల భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంజనమ్మ మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

జెఈఈ మెయిన్స్ టాపర్‌కు సన్మానం

హిందూపురం : ఇటీవల విడుదల అయిన జెఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చి 99.58 శాతం ఉత్తీర్ణత సాధించిన సువర్ణ భారతి విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు నీలకంఠరెడ్డి కుమారుడు గగన్ శ్యామ్ రెడ్డిని సన్మానించారు. స్థానిక సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో వైసిపి యువ నాయకులు మనోజ్ జూలియట్ ఆధ్వర్యంలో గగన్ శ్యామ్‌రెడ్డిని సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు, ప్రిన్సిపల్ నీలకంఠరెడ్డి, ఎ.ఐ. అనిల్ కుమార్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, నాగార్జున, శ్రీరాములు, శ్రీనివాసులు, సడ్లపల్లి ప్రణయ్ రెడ్డి, శ్రీనివాసులు, శ్యామ్ బాబు, చందన్ పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న వైసిపి నాయకుడు మనోజ్‌జూలియట్

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి బత్తలపల్లి

గ్రామాల్లోని అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, ఎంపీడీవో శివనాగప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమర్పించారు. ఎంపీపీ, ఎంపీడీవో మాట్లాడుతూ సమావేశాలకు గైర్హాజరైన అధికారులపై కలెక్టరుకు ఫిర్యాదు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శివశంకర్ నాయర్, వైస్ ఎంపీపీలు సాకే పార్వతి, గజ్జెల వెంగపరెడ్డి, గుర్రం శ్రీనివాసరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి త్రివేణి

ఉద్యమ కార్యాచరణ

ప్రజాశక్తి - ఓబులదేవరచెరువు

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఎపి జెఎసి చేపట్టిన ఉద్యమ కార్యాచరణను జయప్రదం చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు గౌస్ లాజమ్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కొండకమర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 13 లక్షల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఉద్యమించాలని ఎపి జెఎసి తప్పని సరి పరిస్థితుల్లో ఉద్యమ కార్యాచరణ ప్రకటించినట్లు చెప్పారు. 12వ పిఆర్‌సిలో మధ్యంతర భృతి(ఐఆర్) 30 శాతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎపి జెఎసి ఇచ్చిన కార్యాచరణ ప్రణాళికను ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరూ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, సోమశేఖర్ నాయక్, వెంకట చలమయ్య, నాగరాజు, టోపీవలి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు గుణపాఠం చెబుదామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 6వ వార్డులో టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్నిశుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి మినిమ్యానిఫేస్టో పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, జిలకర శీన, రాళ్లపల్లి షరీఫ్, గోసల శ్రీరాములు, పల్లపు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

సొంత ఖర్చుతో తాగునీటి సమస్య పరిష్కరిస్తా : గోనుగుంట్ల

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సొంత ఖర్చుతో ధర్మవరం నియోజకవర్గంలో తాగునీటిసమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన అనంతపురంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో శుక్రవారం ధర్మవరం నియోజకవర్గంలోని తన అనుచర వర్గంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల మాట్లాడుతూ నియోజకవరంలో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించే పరిస్థితి కనిపించలేదన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడం కోసం తమ సొంతనిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అయితే నియోజకవర్గంలో ఏయే గ్రామాలలో తాగునీటిసమస్యఉందో గుర్తించి ప్రణాళికతో రావాలని అనుచర వర్గాన్ని ఆదేశించారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం



భోజనం వడ్డిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పేదవారి ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నామని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. పట్టణంలో హనుమాన్ సర్కిల్ వద్ద చేపట్టిన అన్నదాన కార్యక్రమం శుక్రవారానికి 10వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి పేదవాని ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారన్నారు. అయితే వైసిపి అధికారంలోకి రాగానే ఒక మంచి ఆశయంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ రద్దు చేయడం దుర్మార్గమన్నారు. పేద ప్రజలకు కడుపు నింపే అన్న క్యాంటీన్లు రద్దు చేయడం పేదవారి కడుపు కొట్టడమేనన్నారు. తనవంతుగా పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలన్నదే లక్ష్యంగా గత పది రోజుల నుంచి ఈ అన్నదాన కార్యక్రమం చేపట్టామన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టిసి జిల్లా నాయకులు రామాంజనేయులు, బీసీ సంక్షేమ అధ్యక్షులు నామాల శంకర్, మహిళా నాయకురాళ్లు సుబ్బమ్మ, శాంతమ్మ, చెన్నప్ప, వాల్మీకి గంగాద్రి, పాపారాయుడు, యువ నాయకులు మహేష్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.